బాబోయ్ దుర్వాసన

- ఇష్టారాజ్యంగా సెప్టిక్ ట్యాంకర్ల నిర్వహణ
- బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు విడిచిపెట్టేస్తున్న నిర్వాహకులు
- స్పందించని పబ్లిక్ హెల్త్ సిబ్బంది



కంచరపాలెం ఎఫ్‌సీఐ గిడ్డంగి పరిసరాల్లో పార్కింగ్ చేసిన వాహనాలు



రామ్మూర్తిపంతులుపేటలో నివాసాల మధ్యలో సెప్టిక్ ట్యాంక్ వ్యాన్లు

కంచరపాలెం : జీవీఎంసీ జోన్ – 5 పరిధి కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, జ్ఞానాపురం, తాటిచెట్లపాలెం పరిధిలో గల దయానంద నగర్, చాకలిగెడ్డ, గవర కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట, రాజీవ్ కాలనీ ప్రాంతాల్లో లెట్రిన్ టాంక్ తోడే మిషన్ వ్యాన్లతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు నాలుగైదు ట్యాంకులు వేరే ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వ్యర్థాలను కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన మీద, సాంబమూర్తి నగర్ పోర్టు క్వార్టర్స్, జ్ఞానాపురం ఎర్రిగెడ్డ, ఎఫ్‌సీఐ గిడ్డంగి, డీజిల్ లోకోషెడ్, వాషింగ్‌లైన్‌కు వెళ్లే ప్రాంతంలో విడిచిపెట్టడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారిపోతోందని వాపోతున్నారు. అనంతరం నివాసాల మధ్యే రోజుల తరబడి ఆ ట్యాంకర్లు ఉంచడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు, పాదాచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతాలు పార్కింగ్‌కు అనుకూలంగా ఉండడంతో నగరంలోని ట్యాంకర్లు నిత్యం ఇక్కడే నిలుపుదల చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ – 2024కి విశాఖకు ఉత్తమ ర్యాంకు సాధించడానికి ఇలాంటి సంఘటనలు అవరోధాలుగా నిలుస్తాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళ చీకటి పడే సమయానికి జనసంచార ప్రాంతాల్లో వ్యర్థాలు (పిట్) ఫుట్‌పాత్‌పై గల కాలువల్లో విడిచిపెట్టేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు, స్థానికులు గట్టిగా అడిగితే ట్యాంకర్ల డ్రైవర్లు ఎదురు తిరుగుతున్నారు. కంచరపాలెంలో ట్యాంకర్ల యాజమానులు కూటమి నాయకులు అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పబ్లిసిటీ కోసం స్టిక్కర్లు

కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో సుమారు 35 నుంచి 45 సెప్టిక్ ట్యాంకర్లతో వ్యాపారాలు చేస్తున్నారు. తమ వ్యాపారాల పబ్లిసిటీ కోసం ఆయా ప్రాంతాల్లోని ఇళ్లకు ఇష్టారాజ్యంగా స్టిక్కర్లు అంటించేస్తున్నారు. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలకు సున్నాలు వేసి ఫోన్ నంబర్లు రాస్తున్నారు. ఇళ్లకు అంటించిన సిక్కర్లు ఊడిపోయిన తర్వాత గోడలు అందవికారంగా కనిపిస్తున్నాయని నివాసితులు వాపోతున్నారు. స్టిక్కర్లు అంటించేటప్పుడు మా అనుమతి కూడా తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు విద్యుత్ స్తంభాలపై ఫోన్ నంబర్లు రాయడంతో వాటిపై గల పోల్ నంబర్లు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. సెప్టిక్ ట్యాంక్ నిండిందా... ఫోన్ కొట్టు అంటూ వినియోగదారులను ఆశ్రయిస్తున్న ట్యాంకర్ల యాజమానులు.. పిట్ (వ్యర్థాలు) దూర ప్రాంతంలో విడిచిపెట్టాలని చెబుతూ అధిక ధరలు వసూలు చేసి... సమీపంలోని పబ్లిక్ ప్రాంతాల్లో విడిచి పెట్టేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ట్యాంకర్ల నుంచి వ్యర్థాలు ఇష్టారాజ్యంగా విడిచే వారిపై సంబంధిత పబ్లిక్ హెల్త్ అధికారులు, ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కంచరపాలెం నేతాజీ వంతెన పైనుంచి వ్యర్థాలు కిందకు వదులుతున్న సెప్టిక్ ట్యాంకర్ యాజమాని

పరిసరాలన్నీ దుర్గంధభరితం

నగరంలో సెప్టిక్ ట్యాంకర్ల దందా ఎక్కువగా ఉంది. ట్యాంకర్లు నివాస ప్రాంతాల్లో నిత్యం ఉంచడంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. అటుగా రాకపోకలు చేయాలంటే ముక్కుమూసుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది. జనావాసాలకు దూరంగా సెప్టిక్ ట్యాంకర్లు పార్కింగ్ చేస్తే బాగుంటుంది. సంబంధిత అధికారులు పర్యవేక్షించాలి.

– కె.ఉషశ్రీ, గాంధీనగర్, కంచరపాలెం

పబ్లిక్ ప్రాంతాల్లో విడిచేస్తున్నారు

సెప్టిక్ ట్యాంకర్‌లో నింపిన వ్యర్థాలు నగరానికి దూరంగా తీసుకెళ్లి విడుదల చేయాలి. కానీ ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లోనే వ్యాపారులు ఇష్టారాజ్యంగా విడిచిపెట్టేస్తున్నారు. అడిగితే దౌర్జన్యంగా గొడవకు దిగుతున్నారు. స్థానికంగా గట్టిగా అడిగేవారు లేకపోవడం, పబ్లిక్ హెల్త్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

– ఎం.పైడిరాజు, రామ్మూర్తి పంతులుపేట, కంచరపాలెం

అధికారులు స్పందించాలి

సెప్టిక్ ట్యాంకర్ల యాజమానులు చేస్తున్న తప్పిదాలపై అధికారులు స్పందించాలి. ట్యాంకర్లతో తీసుకొచ్చిన వ్యర్థాలు మా పరిసర ప్రాంతాల్లో వదిలేస్తుండడంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. సంబంధిత జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ అధికారుల దృష్టికి సమస్యను గతంలో తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

– ఎస్.సత్యనారాయణ, దుర్గానగర్, కంచరపాలెం

క్లుప్తంగా

ఉత్సాహంగా స్టోరీ టెల్లింగ్



కథ చెబుతున్న స్టోరీ టెల్లర్ సీత

సీతంపేట : విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యాభవన్ స్కూల్ సంయుక్తంగా పౌర గ్రంథాలయంలోని మియావాకి సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ ఉత్సాహంగా సాగింది. ప్రముఖ స్టోరీ టెల్లర్ సీత తనదైన శైలిలో పిల్లలకు చక్కని కథలు చెప్పి ఆకట్టుకున్నారు. ఈశాన్య భారతదేశంలోని గారోస్ తెగ సాంప్రదాయ కథలను పిల్లలకు పరిచయం చేశారు. సంగీత వాయిద్యాలు, కళాకృతుల మేళవింపుతో కథకు జీవం పోశారు. క్రాఫ్ట్ యాక్టివిటీలో భాగంగా పిల్లలు పేపర్‌తో నెమలి బొమ్మలు తయారు చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది పిల్లలు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



ఉమ్మడి సత్యనారాయణ

మర్రిపాలెం : తన భర్త అదృశ్యమయ్యాడని భార్య కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కైలాసపురం సింగాలమ్మపురంలో భార్య ఉమ్మడి కుమారి, కుమారుడు, కుమార్తెతో కలిసి నివసించే ఉమ్మడి సత్యనారాయణ ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడు. కొంతకాలంగా అతను పనులకు వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 27న ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయిన సత్యనారాయణ కొద్ది సేపటి తర్వాత పిల్లలు చదువుకునే స్కూల్‌కు వెళ్లి వారికి ఓ లెటర్ ఇచ్చాడు. ఏడాదిగా పనులకు వెళ్లకపోవడంతో అప్పులు చేశానని, తన కోసం వెతకొద్దని అందులో రాశాడు. దీంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ వి.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార : ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాని ద్వారక జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశాకు చెందిన అజయ్‌కుమార్ (24), నందుకోహరా (28), చంద్రపంగి (25) కలిసి బెంగళూర్‌కు గంజాయి తరలించేందుకు రామాటాకీస్ దరి కంటి ఆస్పత్రి వద్దకు ఆదివారం చేరుకున్నారు. వారి కదలికలు అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు బ్యాగులు తనిఖీ చేయగా రెండు ప్యాకెట్ల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీఐ డి.వెంకటరమణ నేతృత్వంలో ఎస్‌ఐ శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి (పుట్ట బంగారమ్మ గుడి) ఆలయం పక్కనే ఉన్న కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆదివారం రాత్రి కాలువ నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్‌ఐ వెంకటరావు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీస్తున్నప్పుడు శరీరం కుళ్లిపోవడంతో చర్మం ఊడిపోయింది. మృతుని వివరాలు తెలియలేదని, ఎప్పుడు చనిపోయాడో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



శ్రీనివాసరావుకి చెక్కు అందజేస్తున్న దాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్, ఉమారమణి దంపతులు లక్ష 116 రూపాయల విరాళాన్ని అందజేశారు. సంబంధిత చెక్కుని సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో అన్నప్రసాద విభాగం ఏఈవో పిల్లా శ్రీనివాసరావుకి అందజేశారు.

రామశర్మకు బాలి స్మారక పురస్కారం



రామశర్మకు పురస్కారం అందిస్తున్న అతిథులు

సీతంపేట : విశాఖ సంస్కృతి ఆధ్వర్యంలో ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ బాలి (మేడిశెట్టి శంకర రావు) జయంతి సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. సభాధ్యక్షుడు శిరేల సన్యాసిరావు మాట్లాడుతూ బాలితో తనకు గల పరిచయం, అనుభవాలు, బాలి చిత్రకళా నైపుణ్యం వివరించారు. అనంతరం కొచ్చెర్లకోట సత్యనారాయణ చేతుల మీదుగా ప్రముఖ కార్టూనిస్ట్ పార్నంది వెంకట రామశర్మకు బాలి స్మారక పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. బాలి కుమార్తె మేడిశెట్టి వైశాలి రూ.5 వేలు నగదు పురస్కారం అందజేశారు. పురస్కార గ్రహీత రామశర్మ మాట్లాడుతూ బాలు స్మారక పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని, కార్టూన్స్ గీయడంలో తనకు బాలి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, ఆర్.వి.రమణమూర్తి, వెలమల సిమ్మన్న, చలపతిరావు, సరీజ, యస్.హనుమంతరావు పాల్గొన్నారు.

ముగిసిన చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు



చిత్రాలు ప్రదర్శిస్తున్న చిన్నారులతో నిర్వాహకులు

మర్రిపాలెం : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవోస్ నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు విజయవంతంగా ముగిశారు. జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ జేఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు మాట్లాడారు. విద్యార్థులు సేవాదృక్పథం అలవరచుకోవాలని సూచించారు. స్వచ్ఛతా హీ సేవా – 2024పై విద్యా సంస్థల్లో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు భవిష్యత్‌లో విద్యా సంస్థల్లో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త టీఎస్ఆర్ శ్రీనివాస్, డ్రాయింగ్ టీచర్ మోహన్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవోస్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో జాతీయ సమైక్యత



మాస్టర్ అథ్లెటిక్స్‌కు స్పోర్ట్స్ కిట్‌లు అందిస్తున్న సత్యదేవ్ తదితరులు

మురళీనగర్ : క్రీడలతో జాతీయ సమైక్యత సాధించవచ్చని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. వివిధ విభాగాల్లో పతకాలు సాధించి అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ విజేతలైన క్రీడాకారులను మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తున్న వారికి ఆర్థికంగా సహకారం అందించేందుకు స్వచ్ఛంద, ఇతర సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ – 2024లో పాల్గొని 21 పతకాలు సాధించిన విజేతలకు మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య స్థాపించిన జనకుల ఫౌండేషన్ తరఫున నగదు ప్రోత్సాహకాన్ని ఆయన అందించారు. మలేషియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనడానికి సిద్ధమైన ఏడుగురు క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందించారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, సత్యనారాయణరాజు, జనకుల ఫౌండేషన్ ధర్మకర్త సీహెచ్ శ్రీనివాసరాజు, వనితా వాకర్స్ క్లబ్ కార్యదర్శి జయ, యూనివర్సల్ యూత్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ వంశీ, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగా వరప్రసాద్, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు పాల్గొన్నారు.

అపవిత్ర పొత్తులతోనే గెలుపు



రామ్మోహన్‌రావు

తాటిచెట్లపాలెం : సౌత్ ఈస్టర్న్ రైల్వే, సౌత్ ఈస్ట్ సెంట్రల్, ఈస్ట్ కోస్ట్ రైల్వేకు సంబంధించిన ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (అర్బన్ బ్యాంక్)కి ప్రతిష్టాత్మకంగా జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎన్నికల్లో ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ అపవిత్ర పొత్తులతో గెలిచిందని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ వాల్తేర్ డివిజన్ కో ఆర్డినేటర్ పి.రామ్మోహన్‌రావు ఆరోపించారు. ఫలితాలపై ఆదివారం స్పందించిన ఆయన 700 స్థానాలకు జరిగిన డెలిగేట్స్ ఎన్నికల్లో ఏఐఆర్‌ఎఫ్ 306 స్థానాల్లో విజయం సాధించిందని, ఎస్‌ఎఫ్ఐఆర్ కేవలం 236 స్థానాల్లోనే గెలిచిందన్నారు. కానీ అనైతిక పొత్తులతో 18 మంది డైరెక్టర్లలో 11 స్థానాలను ఎస్‌ఎఫ్ఐఆర్ కూటమి గెలిచిందన్నారు. డెలిగేట్స్ ఎన్నికల్లో ఎస్‌ఎఫ్ఐఆర్ అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చినప్పటికీ కార్మికులు తిరస్కరించి ఏఐఆర్‌ఎఫ్‌కు పట్టం కట్టారన్నారు. కానీ డైరెక్టర్స్ ఎన్నికల్లో ఏఐఎల్ఆర్ఎస్ఏ, ఆలిండియా గార్డ్స్ కౌన్సిల్, ట్రాక్‌మెన్ అసోసియేషన్ అపవిత్ర కలయికతో 11 స్థానాల్లో గెలిచారని ఎద్దేవా చేశారు. వీరి గెలుపు నూరేళ్ల చరిత్ర కలిగిన అర్బన్ బ్యాంక్ భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రామిక్ యూనియన్ నిరంతరం కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు.

రౌడీషీటర్లు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న కంచరపాలెం సీఐ చంద్రశేఖర్



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న సీఐ డీవీ రమణ

మర్రిపాలెం : సమాజంలో అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదని కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సీఐ వి.చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఆయన ఆదివారం కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎవరైనా హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో దూరొద్దని, కుటుంబంతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. అనంతరం వారి రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు.

కుటుంబాలతో సంతోషంగా జీవించండి

సీతమ్మధార : రౌడీషీటర్లు గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ద్వారకా సీఐ డి.వెంకటరమణ హెచ్చరించారు. రౌడీయిజం మానేసి కుటుంబాలతో సుఖ సంతోషాలతో జీవించాలని సూచించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలి ముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లు ప్రతీ ఆదివారం స్టేషన్‌కు తప్పకుండా రావాలని సూచించారు.

- రౌడీషీటర్లు సమాజంలో అల్లర్లు సృష్టించకుండా, తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని ఫోర్తుటౌన్ ఎస్‌ఐ ప్రమీల సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆమె ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రమీల

సెలవు కొనసాగింపుపై రైతుల హర్షం



సీతమ్మధార రైతుబజారులో రైతులతో మాట్లాడుతున్న ఏడీ యాసిన్

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులో ఇక నుంచి ప్రతీ మంగళవారం సెలవు కొనసాగుతుందని జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ తెలిపారు. ఆదివారం ఆయన రైతు బజారును సందర్శించారు. డ్వాక్రా స్టాల్స్ తనిఖీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ మంగళవారం సెలవు కొనసాగిస్తామని చెప్పడంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు. గత రెండు వారాలుగా నగరంలోని నాలుగు బజార్లను మంగళవారం తెరిపించారు. అయితే రైతులు ఎక్కువ శాతం సెలవు కావాలని పట్టుబట్టడంతో అధికారులు అంగీకరించారు. ఆయనతోపాటు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గజ్జెల పూజ



భరత నాట్యం చేస్తున్న యువతులు

సీతమ్మధార : నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల శ్రీమహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలోని నాదయోగి అన్నమయ్య ప్రాంగణంలో నాట్య గురూజీ కె.వెంకట్ సమక్షంలో నాట్య నల్య కళా క్షేత్ర మ్యూజికల్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గజ్జెల పూజ నిర్వహించారు. రెండు సంవత్సరాల నుంచి భరత నాట్యం అభ్యసిస్తున్న విద్యార్థులు వారి తల్లిదండ్రుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. వారికి గజ్జెలు కట్టించి నాట్యం చేయించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ కళల ప్రాముఖ్యాన్ని, నాట్య విశిష్టతను తెలియజేశారు. అనంతరం విద్యార్థుల నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో రమ, సత్య విశాల్, పి.రవీంద్ర పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డెబ్రిస్ తరలింపు



టార్పాలిన్ లేకుండా ప్రమాదకరంగా డెబ్రిస్ తరలిస్తున్న టిప్పర్

కంచరపాలెం : కంచరపాలెం నుంచి మర్రిపాలెం వెళ్లే బీఆర్‌టీఎస్ సబ్‌వే రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్ లారీలు నిత్యం ప్రమాదభరితంగా ప్రయాణం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కంచరపాలెం మీదుగా మర్రిపాలెం వెళ్లే రహదారిలో డెబ్రిస్ లోడుతో టిప్పర్ లారీలు ఆదివారం రాకపోకలు సాగించాయి. ఆ సమయంలో టిప్పర్ లారీలపై టార్పాలిన్ కప్పకపోవడంతో డెబ్రిస్‌లోని ఇసుక వెనుక వచ్చే వాహనదారుల కళ్లల్లోకి పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి వాహనాలపై చర్యలు తీసుకోవాల్సిన ట్రాఫిక్ పోలీస్‌ల జాడ కనిపించక పోవడం దారుణమని, ప్రమాదాలు జరిగితే స్పందిస్తారా అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించాలని స్థానికులు, ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు.

ఆహార నియమాలతో గుండెకు ఆరోగ్యం



దంత పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మురళీనగర్ : ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని కార్డియాలజిస్టు పైలా మనోహర్ సూచించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో కేకే కార్డియా అండ్ ఆకేష్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఇంప్లాంటేషన్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వు తక్కువగా ఉన్న పదార్థాలు తీసుకోవడం, నూనె, నెయ్యి, ప్రాసెస్డ్ ఫుడ్ తగ్గించడం, కనీసం రోజూ 30 నిమిషాలు నడక, హృదయానికి మేలు చేసే వ్యాయామం చేయాలని సూచించారు. దంత వైద్య నిపుణుడు డాక్టర్ ఆకాష్ మాట్లాడుతూ రోజూ రెండు సార్లు ఫ్లోరైడ్ ఉన్న పేస్ట్‌తో బ్రష్ చేయాలన్నారు. ఆరు నెలలకోసారి దంతాలు శుభ్రం చేసుకోవాలన్నారు. శిబిరంలో 205 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులు పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

70 మందికి వైద్య పరీక్షలు

మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 48 ఏ బస్టాపు వద్ద అపోలో ఆస్పత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితా రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో 70 మందికి బీపీ, సుగర్, గుండె సంబంధిత వ్యాధులపై ఉచితంగా పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మాధవ యువజన సమాజం కో కన్వీనర్ పి.రామచంద్రరావు, కె.రఘునాథ్, ఎస్.సీతారామకృష్ణ, ఎన్.వదంతరావు, శేషామణి, శిరీష, వరలక్ష్మి, కమల పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో వైద్య శిబిరం

సీతమ్మదార : జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్‌లోని డాక్టర్ రహమతుల్ల క్లినిక్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో షుగర్, బీపీ, థైరాయిడ్, బీఎండీ, యూరిక్ ఏసిడ్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రహమతుల్లా, శ్రీధర్, సూర్యకుమారి, శివప్రసాద్, సావిత్రి, శ్రీరామ్మూర్తి, నారాయణమూర్తి పాల్గొన్నారు.

అంకోసా నూతన కార్యవర్గం

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ (ఎ.ఎం.సి.ఓ.ఎస్.ఎ) నూతన కార్యవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించింది. ఆదివారం సాయంత్రం జిల్లా పరిషత్ వద్ద ఉన్న అంకోసాలో నూతన కార్యవర్గం పాత కార్యవర్గం నుంచి పదవీ బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్.కె.ఇ.అప్పారావు, కార్యదర్శిగా డాక్టర్ పి.వి.సుధాకర్, కోశాధికారిగా డాక్టర్ ఐ.వాణిత తదితరులు ఎన్నికయ్యారు. వీరిని వైద్యులు వి.చంద్రశేఖరం, ఎస్.వి.ఆదినారాయణ, టి.రవిరాజ్, ఇ.పెదవీర్రాజు, కె.వెంకటేశ్వర్లు, జి.టి.వి.రమేష్ తదితరులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

మహారాణిపేట : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ జూనియర్ కాలేజ్ 1982 – 84 బ్యాచ్ విద్యార్థులు నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కాలేజీ విద్య పూర్తి చేసుకుని 40 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం సామాజిక సేవలో భాగమైన పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో పట్నాల నాగరామ్మోహన్ రెడ్డి, కరణం వేణుగోపాల్, గుజ్జు ఉప్పల్ రెడ్డి, ఎర్ర అప్పారావు, శ్రీలక్ష్మి, మణి కుమారి, అప్పలరెడ్డి, జగ్గారావు, సోంబాబు, దోమడ హరి, రామకృష్ణ రాజు, సీహెచ్ అప్పారావు, చిట్టిబాబు, ధర్మ, పి.సత్యనారాయణ, గంగాధర్, బేగం, అప్పల నరసింహారెడ్డి పాల్గొన్నారు.